# దేశ సేవ

హోరు హోరు మని చప్పుడు చేస్తూ తుఫాను మెయిలు వస్తోంది. జనం గబగబా అటూ ఇటూ సర్దుకున్నారు. కారునల్లని తుఫాను మెయిలు యమ స్పీడుతో దూసుకుపోయింది. చెవులు ఒక్కక్షణం చెవుడెక్కిపోయాయి. అంతా సెకండ్ల మీద జరిగిపోయింది.

నల్లని రంగులో ఉన్న రాజదూత్ బండినే మా వూళ్ళో 'తుఫాను మెయిలు' అంటారు. దానిమీద కూచున్నవాడిని 'తుఫాను దొర' అనీ, 'తుఫాను బాబు' అని కూడా అంటూంటారు.

'తుఫాను దొర' పేరు - ఇరవయ్యేళ్ళ క్రితం సూరిబాబుగాడు. వాడూ నేనూ ఆ రోజుల్లో విశాఖపట్నం మిసెస్ ఏవియన్ కాలేజీ హైస్కూల్లో థర్డ్ ఫారం చదువుకొన్నాం చదువులో "మొద్దు". అల్లరిలో 'పెద్ద' నేను థర్డ్ ఫారంలోకి వచ్చేసరికి, సూరిబాబుగాడు థర్డ్ఫారం థర్డియర్‌లో ఉన్నాడు, అంటే గత రెండేళ్ళూ వాడి పరీక్ష తన్నేసిందన్నమాట. వాడికీ నాకూ వయసులో మూడేళ్ళు వారి ఉంది. నాకున్న స్నేహితులందరూ సెకండుఫారం వాళ్ళూ, థర్డ్ఫారం వాళ్ళూనూ. వాడి స్నేహితులందరూ ఎస్సెస్సెల్సీ వాళ్ళూ, కాలేజీ వాళ్ళూనూ. ఆడ గుంటల్ని ఏడిపించడంలో వాడు మొదట్లో, తన నేస్తాలకి సాయం చేసేవాడు. ఆ తరువాత స్వయంగా తనూ ఏడిపించడం, వెంట తగలడం సాగిస్తుండేవాడు. థర్డ్ఫారం థర్డియర్ వెధవ, పీయూసీ చదువుతున్న పద్మిని వెనకాల పడేవాడు ! సిజర్సు సిగరెట్లు కాల్చేవాడు. అప్పటికే చెయిన్ స్మోకర్.

వాళ్ళ ఇల్లు యల్లమ్మతోట జంక్షను దగ్గర్లో ఉండేవి, నేనొక్క సారంటే ఒక్కసారే వెళ్ళాను. ఒక పాత కాలపు పెంకుటిల్లు. అప్పటికి దసపల్లా చిత్రాలయా లేదు, జగదంబా జంక్షనూ లేదు. యల్లమ్మ తోట జంక్షనే అనేవాళ్ళం, నా కెందుకో ఇప్పటికీ ఆ పేరంటేనే చాలా సరదా.

ఆదివారం వచ్చిందంటే, లీలామహల్లో ఇంగ్లీషు సినిమా తప్పక చూసేవాడు. మర్నాడు తెలుగు మేస్టారి పీరియడులో, ఆ సినిమాల్లోని ముద్దుల సీన్ల గురించీ సవివరంగా చెబుతుండేవాడు - మేస్టారు తిడతారేమోనని నేను భయంతో చచ్చిపోతుండేవాణ్ణి. వాడికి మేష్టర్లంటే ఎంతమాత్రం ఖాతరుండేది కాదు.

టవునుహాలు బీచి ఇసుకలో ఆడుకుంటున్నప్పుడు వాడికీ నాకీ పెద్ద జట్టీ అయిపోయింది . ఇంతకీ ఎందుకనుకున్నారూ ? సముద్రంలో దూరంగా లంగరు వేసిన వోడ జపాను వాడిదా, అమెరికా వాడిదా ? అన్న సమస్య మీద తగువు వచ్చింది. జేబులోంచి టక్కుమని పది రూపాయల నోటు తీసి "ఆ వోడ జపాను వాడిదే, కావాలంటే పదికి పదీ పందెం కలుపు" అలా గన్నాడు. నా దగ్గర పది పైసలు కూడా లేవు. అరిగిపోయిన అణా కాసుంది. మరెందుకనీ నేను తగ్గిపోయేను. ఆ మర్నాడు తెలిసింది, ఇంతా చేస్తే అది సింగపూర్ నుంచి వచ్చిన వోడట, హార్బరు కళాసీ అప్పన్న కొడుకు అప్పారావు చెప్పాడు. పోనంతటితో వూరుకోవాలా ? మాట మాటకీ నన్ను ఉడికించేవాడు, వాడి కొత్త చొక్కామీద, వెనక నుంచి ఇంకు జల్లేశాను. చెంగల్రావు పేట చెంచురాముడు వాడికా భోగట్టా చెప్పేశాడు, నేను చెంచురాముడిగాడి

చెంప పగలగొట్టాను. సూరిబాబుగాడు నా అట్లాసు చింపేశాడు, నాలుగు తన్నినా బాధపడక పోదును. కొత్త ఆక్స్‌ఫర్డ్ అట్లాసు-బుక్ సెంటర్ వరాల శెట్టిగారి దగ్గిర ముందు రోజునే కొన్నాను-చింపేశాడు. పైగా నాకెంతో ఇష్టమైన యూరప్ ఖండం ఉన్న కాయితమే చింపేశాడు. నా దుఃఖం ఎలా తీర్చుకోవాలా అన్న ఆలోచన తప్ప నెల్లాళ్ళదాకా నాకు మరో ఆలోచనే లేదు. ఇంతలో వాళ్ళమ్మ చచ్చిపోయిందట. వాడు క్రమంగా మరి బడి మానేశాడు. నా అట్లాసు చింపి నన్ను దుఃఖపెట్టి నందుకే, వాళ్ళమ్మ చచ్చిపోయి ఉంటుందని నాకు ఎందుకో బలంగా నమ్మకం కలిగింది. ఇతర్లకు నష్టం కలగచేసిన వాళ్ళు తప్పక నష్టపోతారనీ, శిక్షఅనుభవిస్తారనీ, ఆ రోజుల్లో నేను వెర్రిగా నమ్మేవాణ్ణి.

ఆ తరువాత సూరిబాబుగాడి సంగతి ఏమయిందీ, ఏడాది వరకూ, నాకు తెలీలేదు. ఒక రోజు చెంగల్రావు పేట పక్కనే సముద్రపు ఒడ్డున ఉన్న మినర్వా టాకీసులో పాతాళ భైరవి సినీమా వస్తే చూడడానికి వెళ్ళాను. ఎప్పుడో చిన్నప్పుడు చూశానా సినీమా. మళ్ళీ చూద్దామని హాఫియర్లీ పరీక్షలయిపోయిన మర్నాడు వెళ్ళాను. టిక్కట్లమ్మే కిటికీ కన్నాల్లోంచి ఒంటి కన్నుతో చూద్దునుగదా, సూరిబాబుగాడే. "ఒరే సూరిగా బావున్నావురా, బడికి రావడం ఎందుకు మానేసేవురా " అని అడుగుదానుకున్నాను. కాని ఎందుకో అడగలేదు. ఇంటర్వెల్లో చూస్తే వాడు కనపడలేదు.

ఇది జరిగిన పన్నెండేళ్ళ తరువాత 1978 లో గోపాలపట్నంలో పాత సినీమా హాలు దగ్గర కనిపించాడు.

వాళ్ళదసలు గోపాలపట్నమేనట. నా కిప్పటికీ తెలీనే తెలీదు కంట్రాక్టులు చెయ్యడం ప్రారంభించాడట. దుక్కతన్నేడు. బాగా వలంగా ఉన్నాడు. ఏదో నాలుగు 'రాళ్ళు' సంపాదించుకున్నాడట. మంచిదే కదూ.

నేను బీయే వెలగబెట్టి, గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాను. మా ఆఫీసులో పని చేస్తున్న కోదండరావుకి గోపాలపట్నం - ఆదర్శనగర్‌లో ఆరు సెంట్ల స్థలం ఉంది. అదమ్మేస్తానంటున్నాడు. చూద్దాం కదా అని నేనొచ్చాను. ఇంతట్లో సూరిబాబుగాడు తగిలాడు.

స్థలం కొనమంటావా ? నీ ఉద్దేశం ఏమిటని అడిగాను, మంచిదే కొనమన్నాడు. ఇల్లు కట్టుకునేటప్పుడు తనని పిలిస్తే సాయం చేస్తానన్నాడు. ఇన్నాళ్ళకు సూరిబాబుగాడు నాకు సాయం చేసేపాటి వాడయ్యాడు!

1977 నవంబర్ 19 తుఫాను గురించి అందరికీ తెలుసు. ఆంధ్రప్రదేశం అంతటా ఎంతో నష్టం వాటిల్లింది. ఎన్నో రోడ్లు పోయియి. భవనాలు కూలిపోయాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. ఉత్తరాంధ్ర పరిస్థితి ఈ మాత్రంగానన్నా వుంది. దివిసీమ మొత్తం సముద్రం వూడ్చుకుపోయింది. వందలాదిమంది చచ్చిపోయారు. దివిసీమ స్మశానం దిబ్బయిపోయింది. చాలా భయానకమైన పరిస్థితి.

అంతవరకూ బేవార్సుగా తిరుగుతున్న సూరిబాబుగాడు, ఆ టైములో మేలు కున్నాడు. పెళ్లాం వంటిమీద నగలు మదుపు పెట్టి, కాంట్రాక్టుల్లోకి దిగాడు.

వాడు కొంచెం లాభాలు గడించడం ప్రారంభించేసరికి, కాంగ్రెస్ దెబ్బ తినేసింది. దేశం జనతా

చేతుల్లోకి పోయినా రాష్ట్రం కాంగ్రెసు చేతుల్లోనే ఉన్నందుకు సూరిబాబుగాడు చాలా సంతోషించేడు, రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడు అయిదు వేలు "పార్టీ ఫండు" ఇవ్వగలిగాడు. ఇచ్చాడంటే, ఒక లక్ష రూపాయల కాంట్రాక్టు సంపాదించాకే ఇచ్చాడు. పార్లమెంటు ఎన్నికల సమయంలో "పదివేలు పార్టీ ఫండుగా" ఇచ్చేడని తెలిసింది, నిజానిజాలు మనకీ కరెక్టుగా తెలియదు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ పార్టీ పోయినా వాడికి సంబంధం లేదు. సొమ్ము దండిగా చేతికి వస్తున్నాక, ఎవరెలాపోతే వాడికెందుకు ? ఆ తరువాత ఆంధ్రదేశం పరిస్థితి, ముఖ్యంగా విశాఖపట్నం జిల్లా పరిస్థితి మూడు తుఫానులూ, ఆరు కరువులూ అనే రకంగా తయారయింది టీవల ముఖ్య మంత్రి మారినప్పుడల్లా, ఒక తుఫాను రావడం పరిపాటయి పోయింది.

"ముఖ్య మంత్రి కరువు నివారణ నిధి" కి విరాళాలు సేకరించే పనిలో చాలా చురుగ్గా తిరిగాడు. తుఫానో, కరువో ఏదో ఒకటి రాకపోతే దేశసేవ చెయ్యడం ఎలాగ ? అనేక రోడ్లు, భవనాలు కట్టించి యధాశక్తి 'దేశసేవ' చేశాడు. హరిజన కాలనీలు కట్టించినపుడు అంతగా 'దేశసేవ' చెయ్యడం కుదరలేదు, కేవలం రోడ్లు మరియు భవనాల నిర్మాణంవల్లనే దేశ సేవ చెయ్యడం సాధ్యంకాదని అర్థం చేసుకున్నాక, ఒక రిటయిన ఇంజనీరుగార్ని సాయం చేసుకుని, కొంచెం పెద్ద పెద్ద పనులు ప్రారంభించాడు.

1980 లో శ్రీకాకుళం జిల్లాలో వంశధార వరద లొచ్చాయి చూశారా ? అది మా సూరిబాబు జీవితంలో పెద్ద మలుపు తీసుకొచ్చింది. వాడి బంధు వొకడు రాష్ట్రంలోనూ, మరింకో బంధువు కేంద్రంలోనూ ఉన్నారు. వాళ్ళ సహాయంతో 'పెద్ద మదుం' కాంట్రాక్టు సంపాయించాడు. మా ఉత్తరాంధ్రలో 'మదుం' అంటే వంతెన అని అర్థం, మూడు కాణాల మడుం, దానికి అటు ఇటూ మొత్తం అయిదు వందల మీటర్ల రోడ్డు ఎత్తు చెయ్యడం, మొత్తం రెండు కోట్లు ఖర్చు. ఆ మాత్రం లేనిదే 'ధారాళంగా దేశసేవ' చెయ్యడం ఎలా కుదురుతుంది ? దాంతో గోపాలపట్నంలోనే బ్రహ్మాండమైన బిల్డింగు కట్టించుకున్నాడు, కారు కొన్నాడు, కాని కొన్నమూడో రోజునే, మందు నిషాలో ఒక గుంటణ్ణి మట్టించేశాడు. ఆ గొడవ వదిలించుకోవడానికి నానా పాటూ పడవలసి వచ్చింది. విసుగొచ్చి కారమ్మేసి, రాజదూత్ కొనక్కున్నాడు.

వాడు సంపాదించిన సొమ్మంతా తుఫాను కంట్రాక్టు లోనే సంపాదించిందేనని వూరందరికీ తెలుసును, తుఫాను దొరగా ప్రసిద్ధుడయ్యేడు, పెద్ద చప్పుడు చేస్తూ యమస్పీడుగా రాజదూత్ మీద వెళ్ళడం అంటే వాడికి పిచ్చి సరదాట. వాడి సరదా మండిపోను.

లక్షలాది ప్రజా ధనాన్ని వాడు అప్పనంగా సంపాయించేడనడానికి ఎంత మాత్రం సందేహం లేదు. మరది తప్పుకదా ? తప్పు చేసిన వాడికి తప్పక శిక్ష ఉంటుందని చిన్న ప్పుడు గట్టిగా నమ్మేవాడిని, కాని ఇటీవల అనేక అనుభవాలు పొందిన తరువాత, లోకం పోకడ పరిశీలించిన తరువాత ఆ నమ్మకం పోయింది, అక్రమధనం నిలబడదనే మాట నిజమే అయితే, మా వూళ్ళో చాలా బిల్డింగులు కూలి పోవాలి, అలా కూలిపోతున్న దాఖలా ఏమీ లేదు,

గవర్నమెంటుద్యోగం చేస్తూ, బదిలీలతో వూళ్ళు తిరుగుతూ నేను ఏమీ సంపాదించుకోలేక

పోయాను. నాలుగేళ్ళ క్రితం కొంత ఎరియరు సొమ్ము అందితే, దానికి మరికొంత అప్పు చేసిన సొమ్ము చేర్చి గోపాలపట్నంలో కోదండరావు అమ్మిన ఆరు సెంట్ల స్థలం కొన్నాను. ఆ అప్పు ఇంకా తీరనేలేదు. తుఫాను సమయాల్లో గాని, మరే సమయాల్లో గాని 'దేశ సేవ' చేసే అవకాశం నాకు లేదు, గవర్నమెంటు ద్యోగస్తులు మాత్రం శక్తివంచన లేకుండా 'దేశ సేవ' చేస్తున్నవాళ్ళు లేదా ? అని మీ రడగొచ్చు. వారు పని చేస్తున్న వివిధ శాఖలు వారికి ఆమహద్భాగ్యం కలగజేస్తున్నాయి. అందుకు నేను ఎంతమాత్రం తగనని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ఈ మధ్యబొత్తిగా తుఫానులు రావడం లేదని, మా తుఫాను బాబు, అదే సూరిబాబు తెగ విసుక్కుంటున్నాడు. ఇళ్ళు కాలితే బొగ్గు లేరుకోవడానికి వచ్చేవాళ్ళుంటారు. అలాంటి 'దేశ సేవ' మన కెందుకు ?

అదుగో, మళ్ళీ 'తుఫాను మెయిలు' అట్నించిటు వస్తున్నది. పక్కకు తప్పుకోవడం మంచిది. మళ్ళీ కలుద్దాం. ప్రస్తుతానికి సెలవు.

*ప్రచురణ : ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం, 2-12 -1984*